క్లుప్తంగా

ప్రభాకర్‌గౌడ్‌కు సన్మానం



సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

దహెగాం: మండలంలోని పంబాపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్‌గౌడ్ తెలంగాణ టెలికం అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా ఎన్నికైనందున శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల పల్లెలకు బీఎస్‌ఎన్‌ఎల్ సేవలను అందించడానికి తన వంతు కృషి చేస్తామన్నారు. టీఏసీ మెంబర్‌గా ఎన్నుకున్నందున ఎంపీ గేడం నగేశ్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోండ్ర తిరుపతిగౌడ్, సంజీవ్, దెబ్బిడి సత్యం, రాపర్తి రమేశ్, తోట చందు, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: సమ్మర్ సీజన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని 11 కేవీఏ లైన్‌లో చెట్లను తొలగించేందుకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రవిచంద్ర కాలనీ, నూర్‌నగర్, సందీప్‌నగర్, బజార్వాడీ, ఏఎంసీ మార్కెట్ ఏరియా, కసాబ్‌వాడీ, బ్రాహ్మణవాడ, రావులవాడ, వివేకానందచౌక్, గాంధీచౌక్ నుంచి కేబీ చౌక్ వరకు, పైకాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మి రాజ్యం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

విరాళాలు సేకరించిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న గోపాల్

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఇతరులకు సాయం చేసే గుణం కలిగి ఉండాలని భారతీ విద్యామందిర్ పాఠశాల కరస్పాండెంట్ దుర్గం గోపాల్ అన్నారు. శ్రీసాయి అనాథ వృద్ధాశ్రమ వెల్ఫేర్ సొసైటీకి విరాళాలు అందించిన విద్యార్థులను శనివారం మండల కేంద్రంలోని పాఠశాలలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రూ. 8,844 నగదు విరాళాలు సేకరించి అనాథ ఆశ్రమానికి అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవ చేయడానికి ముందుండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు మేధాశక్తికి పదును పెట్టాలి

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులు మేధాశక్తికి పదునుపెట్టి అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, సృజనాత్మకత అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు తమ సృజనాత్మకత ఉపయోగించి నూతన ఆవిష్కరణలకు మార్గం కనుగొనాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి తూడూరు దత్తాత్రేయ, కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు లక్ష్మనరసింహం, జనార్దన్, రాజేశ్వర్, దేవేందర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



శిశువును అప్పగిస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని లెండిగూడ గ్రామానికి చెందిన జి.సోని అనే గర్భిణీ 108 వాహనంలో ప్రసవించినట్లు ఈఎంటీ ఎనగంటి ప్రవీణ్, పైలెట్ విలాస్ తెలిపారు. శుక్రవారం రాత్రి గర్భిణీకి పురిటినొప్పులు రాగా కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో సోనీని వాంకిడి ప్రభుత్వాసుపత్రికి తరలించే క్రమంలో నొప్పులు ఎక్కువ కావడంతో మార్గమధ్యలో అంబులెన్స్‌ను నిలిపి డెలివరీ చేయగా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు సిబ్బంది తెలిపారు.

అసంపూర్తిగా పాఠశాల భవనాలు

- తరగతులకు గదులు కరువు
- శిథిలావస్థ గదుల్లోనే నిర్వహణ
- ఇబ్బందుల్లో బాబాసాగర్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు



నిర్మాణం పూర్తికాని గదిలో చదువుకుంటున్న విద్యార్థులు

చింతలమానెపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో శిథిలావస్థలో ఉన్న భవనాల్లో విద్యార్థులకు తరగతులు కొనసాగుతున్నాయి. మండలంలోని బాబాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 వరకు తరగతులు కొనసాగుతున్నాయి. పాఠశాలలో 180 మంది విద్యార్థులు ఉండగా 12 మంది ఉపాధ్యాయులు విధుల్లో ఉన్నారు. పాఠశాలలో పాత భవనం శిథిలావస్థకు చేరుకోగా 12ఏళ్ల క్రితం భవనాన్ని మంజూరు చేశారు. అనంతరం ఇదే పాఠశాలకు ఐదేళ్ల క్రితం అదనంగా నిధులు మంజూరు చేయగా అదనపు గదుల నిర్మాణ పనులు ప్రారంభించారు. గదులు నిర్మించి పైకప్పు పూర్తి చేసి అసంపూర్తిగా వదిలేశారు. మరోవైపు మన ఊరు మన బడి పథకంలో పాఠశాలకు భోజనశాల, ఇతర గదులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించిన గుత్తేదారు మధ్యలోనే పనులు నిలిపివేశారు. ప్రస్తుతం పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న మూడు గదులు, మరో భవనంలో రెండు గదులు అందుబాటులో ఉన్నాయి.

అసంపూర్తి భవనంలో తరగతులు..

పాఠశాలలో 5 తరగతులు నిర్వహిస్తుండగా పాఠశాల స్టాఫ్‌రూం, పాఠశాల కార్యాలయం, వంటగది, ప్రయోగశాలలు ఉన్నాయి. వీటిలో తరగతులకు గదులు సరిపోక పోవడంతో మొదటి అంతస్తులో అసంపూర్తిగా ఉన్న గదుల్లోనే 7, 8 తరగతులు నిర్వహిస్తున్నారు. మొదటి అంతస్తు వరండా గోడలు ప్రమాదకరంగా ఉండడంతో అడ్డుగా కర్రలు పెట్టి ఉంచారు. ఉపాధ్యాయుల కోసం స్టాఫ్‌రూం శిథిలమైన భవనంలో నిర్వహిస్తున్నారు. పాఠశాల కార్యాలయం, ప్రధానోపాధ్యాయుడి గది, మరో రెండు తరగతులను శిథిలావస్థలో ఉండి మరమ్మతులు నిర్వహించిన గదుల్లో నిర్వహిస్తున్నారు.



పెచ్చులూడుతున్న గది పైకప్పు



శిథిలావస్థలో వంట గది

విద్యార్థులకు తిప్పలు..

తరగతులు సరిపోకపోవడంతో పలుమార్లు విద్యార్థులకు చెట్లకిందే బోధన నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. మరోవైపు అసంపూర్తి గదుల్లో బోధన కారణంగా వర్షాకాలంలో, ఎండాకాలంలో విద్యార్థులు వాతావరణ ప్రభావంతో ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తిగా ప్లాస్టరింగ్ చేయకుండా వదిలేసిన పైకప్పు పెచ్చులు ఊడుతోంది. దీంతో ప్రమాదాలు జరిగే పరిస్థితులు ఉన్నాయి. వంటగది సైతం శిథిలమయ్యే పరిస్థితిలో ఉండగా వంటగదిలో కనీసం సరుకులు కూడా నిల్వ ఉంచుకోలేక పోతున్నామని వంట నిర్వాహకులు తెలియజేస్తున్నారు.

అదనపు గదుల నిర్మాణం..

పాఠశాలలో ఇటీవల రూ. 26 లక్షలతో అదనపు గదుల నిర్మాణం ప్రారంభించారు. ఇవి నిర్మాణం పూర్తయ్యి వినియోగంలోకి వస్తే విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుంది. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న గదుల నిర్మాణం సైతం పూర్తి చేస్తే ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అరికట్టవచ్చని గ్రామస్తులు పేర్కొంటున్నారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకుని పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆటలు ఆడించేదెవరు..?



ఆటలు ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

- ప్రభుత్వ కళాశాలల్లో పీడీలు కరువు
- క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు అభివృద్ధి పర్చేందుకు విద్యాశాఖ వ్యాయామ ఉపాధ్యాయులను నియమిస్తోంది. అయితే ఈ నియామకాలు పాఠశాల స్థాయి వరకే పరిమితం కావడంతో ఇంటర్ విద్యార్థులు క్రీడలకు దూరం అవుతున్నారు. జిల్లాలో ఆర్థిక స్తోమత లేని పేద విద్యార్థులే అధికం. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజులు కట్టలేక స్థానికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందుతున్నారు. ఈ ఏడాది అన్ని కళాశాలల్లో కలిపి ప్రథమ, ద్వితీయ ఇంటర్ విద్యార్థులు సుమారు 8వేల మంది ఉన్నారు. వీరిలో ప్రభుత్వ కళాశాలల్లో 4668 మంది చదువుతున్నారు. వీరికి కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకులు లేక క్రీడలకు దూరంగా ఉంటున్నారు. అదే గురుకుల కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకులు ఉండటంతో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

నియామకాలు లేవు..

జిల్లాలో మొత్తం 48 కళాశాలలు ఉన్నాయి. ఇందులో 11 ప్రభుత్వ కళాశాలలుండగా మిగితా 37 కళాశాలల్లో ప్రైవేట్, గురుకుల, కేజీబీవీలున్నాయి. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేకంగా క్రీడా కోటా అమలు చేస్తున్నారు. జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ఈ రిజర్వేషన్లు వర్తింపజేస్తున్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే పాఠశాల, కళాశాల స్థాయిల్లో క్రీడల్లో తర్ఫీదు అవసరం. క్రీడా శిక్షణనిచ్చే ప్రత్యేక అధ్యాపకుల నియామకం చేపట్టాల్సి ఉన్నా నియామకాలు, పదోన్నతులు లేని కారణంగా ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. నియామకాలు, పదోన్నతులకు న్యాయపరమైన చిక్కులు ఉన్నట్లు చెబుతున్న ప్రభుత్వం తాత్కాలిక పద్ధతిలోనైనా వ్యాయామ అధ్యాపకులను నియమించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో దహెగాం, బెజ్జూరు, సిర్పూర్(టి) కళాశాలల్లో మినహా ఇతర కళాశాలల్లో ప్రహరీలు లేక స్థలాలు ఉపయోగించే స్థితిలో లేవు. జిల్లాలోనే కాదు జోన్‌లోనే బెల్లంపల్లిలో మాత్రమే ఒక వ్యాయామ అధ్యాపకుడు ఉన్నారు.

పోస్టులు భర్తీ చేస్తే విద్యార్థులకు మేలు

జిల్లాలోని కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. క్రీడలపై ఆసక్తి ఉన్న విషయ అధ్యాపకులు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. పీడీ పోస్టులను భర్తీ చేస్తే విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెరుగుతాయి. వారికి మేలు జరుగుతుంది. – కల్యాణి, డీఐఈవో

ఏరియాలో 104 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న ఏరియా జీఎం శ్రీనివాస్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా గడిచిన జనవరిలో 104 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిందని ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏరియా సాధించిన ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ జనవరి నెలకు గానూ బెల్లంపల్లి ఏరియాకు 4.20లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 4.35 లక్షల టన్నులతో 104 శాతం ఉత్పత్తి సాధించామన్నారు. ప్రణాళికబద్ధమైన ఉత్పత్తి ప్రక్రియతో ముందుకు సాగుతుండటంతో 100 శాతానికి మించి ఉత్పత్తి సాధించగలిగామని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి వరకు ఏరియాకు 30.20 లక్షల టన్నుల లక్ష్యం ఉండగా 27.98 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామని తెలిపారు. వార్షిక లక్ష్యాన్ని 100 శాతం సాధించేందుకు ఇంకా 9.5లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించాల్సి ఉందన్నారు. రోజువారీగా 16వేల టన్నుల ఉత్పత్తి సాధిస్తే వార్షిక లక్ష్యాన్ని సాధించగలుగుతామని వివరించారు. ఉత్పాదకతలో బెల్లంపల్లి ఏరియా 93 శాతంతో ముందుకు సాగుతోందన్నారు. సమావేశంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మార్కండేయ జయంతి



శోభాయాత్రలో పాల్గొన్న పద్మశాలీలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శ్రీశివభక్త మార్కండేయస్వామి జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలోని అటవీశాఖ చెక్‌పోస్ట్ సమీపంలోని భక్తమార్కండేయస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు హోమంలో పాల్గొన్నారు. ఆలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా మహిళలు కోలాటం ఆడుతూ శోభాయాత్ర నిర్వహించారు. దీంతో జిల్లా కేంద్రంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు, పట్టణాధ్యక్షుడు అనుమాండ్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి అల్లె శ్రీకాంత్, నాయకులు లింగయ్య, చెన్నూరి ప్రకాశ్, చందు, శంకర్, మోహన్, అజయ్, అంజయ్య, ధర్మయ్య, రమేశ్ పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని గోలేటిలో పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం మార్కండేయ మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ మహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. మంతు సమ్మయ్య, మంగ దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ దంపతులు, ఎస్‌వోటూజీఎం రాజమల్లు దంపతులు జయంతి ఉత్సవాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పద్మశాలీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పద్మశాలీల కులదైవం మార్కండేయుడి జయంతి అన్ని గ్రామాల్లో నిర్వహించాలని కోరారు. గోలేటి పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వీరస్వామి, మండల ప్రధాన కార్యదర్శి పోచయ్య, కోశాధికారి మురళీ, కోశాధికారి మారిన చందర్, సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్



ఇసుక సీజ్ చేస్తున్న తహసీల్దార్ రామ్మోహన్ రావు, ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: మండలంలోని రాళ్లపేట రైల్వేస్టేషన్, పెద్దవాగు, రాళ్లపేట పరిసరాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను శనివారం రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని వంకులం, పెద్దవాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకొచ్చి రాళ్లపేట పరిసరాల్లో అక్రమంగా డంప్ చేసి రాత్రివేళల్లో లారీల్లో ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు దొంగచాటుగా తరలిస్తున్నారు. ఈ విషయం రెవెన్యూ, పోలీసు శాఖల దృష్టికి రావడంతో శనివారం రాళ్లపేట శివారులో తనిఖీలు చేయగా 75 ట్రాక్టర్ల ఇసుక కుప్పలను గుర్తించారు. వెంటనే ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు తహసీల్దార్ రామ్మోహన్‌రావు తెలిపారు. మండలంలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలించినా, అక్రమంగా నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్, ఆర్ఐ ప్రేంకిరణ్ పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్కపల్లిలో క్రికెట్ టోర్నమెంట్

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ దండె విఠల్, పెంచికల్‌పేట్ మాజీ జెడ్పీటీసీ సముద్రాల సరిత రాజన్నల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నమెంట్ ఈనెల 3వ తేదీన ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు దుర్గం రాజు 99515 13166, జాడి రాజేశ్వర్ 76608 50190, జాడి మల్లేశ్ 9010611738, మహేశ్ 9949988263, సంతోష్ 8790063620లను సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

3 నుంచి కబడ్డీ పోటీలు

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలో ఈ నెల 3నుంచి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు సాయినాథ్ శనివారం తెలిపారు. ఈ పోటీలు 55 కేజీల విభాగంలో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తామని, క్రీడాకారులకు ఉచితంగా భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ. 30 వేలు, ద్వితీయ రూ. 20 వేలు, తృతీయ రూ. 5వేలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.1200 చెల్లించి తమ జట్టు పేరును నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9346951819, 6302093179 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కార్డెన్ సెర్చ్



అవగాహన కల్పిస్తున్న సీఐ స్వామి

కాగజ్‌నగర్‌రూరల్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఎస్పీ రామానుజం అన్నారు. శనివారం మారుతినగర్, సీబాబు కాలనీలలో పోలీసులు ఆకస్మికంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్సూరెన్స్, ఇతర పత్రాలు, నంబర్‌ప్లేటు లేని 70 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్‌తో పాటు 9 మంది ఎస్సైలు, 75 మంది పోలీసులు పాల్గొన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు రెబ్బెన సీఐ బుద్దె స్వామి, తిర్యాణి ఎస్సై శ్రీకాంత్ అన్నారు. శనివారం మండలంలోని గంభీరావు పేట గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎస్సైలు, 48 మంది పోలీసు సిబ్బందితో 150 నివాసాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని, గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు కన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వాహనాల యజమానులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లైసెన్సులు, ఇన్సూరెన్స్‌లు లేకుండా వాహనాలు నడపకూడదని సూచించారు. నంబర్ ప్లేట్‌లు లేని 15 వాహనాలు గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు.

జైనూర్‌లో..

జైనూర్: నేరాల నియంత్రణకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ రమేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి వివిధ కాలనీల్లో తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 46 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. తనిఖీల్లో ఆరుగురు ఎస్సైలు, 67 మంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



'టాప్'లో ప్రమాదం..!

మారుమూల గిరిజన గ్రామాలకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదునుగా జీపు యజమానులు ప్రయాణికులను పరిమితికి మించి ప్రమాదకరంగా గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. జీపులోపలే కాదు.. జీపు టాప్‌పైన కూడా ప్రయాణికులను కూర్చోబెడుతున్నారు. కెరమెరి మండలంలో ఇది నిత్యం జరుగుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. - కెరమెరి

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



స్వాధీనం చేసుకున్న కలప, నిందితులతో పోలీసులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రం సమీపంలోని అడా గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న కలపను అటవీ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఆసిఫాబాద్ అటవీ రేంజ్ అధికారి గోవింద్ సింగ్ సర్దార్, జోడేఘాట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారం మేరకు అడా గ్రామం వద్ద అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆసిఫాబాద్‌కు కారులో కలప తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకొని రూ.18వేల విలువగల నాలుగు కలప దుంగలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు మొహమ్మద్ గౌస్, మొహమ్మద్ ఆఫ్తబ్ హుస్సేన్, ఆత్రం రాజు, మడావి మెంగు, ఆత్రం లక్ష్మణ్‌లను సిర్పూర్ కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. నిందితులను జిల్లా కేంద్రంలోని సబ్‌జైలుకు తరలించినట్లు వివరించారు. ఆసిఫాబాద్ డెప్యూటీ రేంజ్ అధికారి యోగేష్ కులకర్ణి, సెక్షన్ అధికారులు సాయిచరణ్, విజయ్ ప్రకాశ్, చంద్రకాంత్, రఘు, బీట్ అధికారులు స్వప్న, మారుతి, అమరేందర్, సాదిక్ భూమేశ్, నాజీర్, రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్థిక వ్యవస్థపై బడ్జెట్ ప్రతికూల ప్రభావం'

కాగజ్‌నగర్‌రూరల్: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందన్నారు. జిల్లా అధ్యక్షుడు రాజేందర్, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణపై విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వాంకిడి: నేషనల్ గ్రీన్‌కోర్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నివారణపై మండల కేంద్రంలోని జెడ్పీఎస్‌ఎస్ పాఠశాల విద్యార్థులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేస్తూ మండల కేంద్రంలో పర్యటించారు. అనంతరం ప్లాస్టిక్ నివారణ అంశంపై విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నటరాజ్, ఉపాధ్యాయులు నాగరాజు, సంతోష్ కుమార్, వెంకట్రావ్, రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.